
"ప్రతి మనిషీ రెండోవాడికి ఒక జీవితమంత దూరం"!




"డియర్ ?"

"ఊఁ"

"ఇంకా తెమల్లేదా?'' టై బిగించుకుంటూ అన్నాన్నేను. డియర్ నా భార్య సుజీ. డ్రెస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని గంట నుంచీ ముస్తాబవుతోంది

"అయిపోయింది" అంటూనే పెదాలకు లిప్‌స్టిక్ పూసుకుంటోంది. ఆ ఎరుపు అద్భుతంగా వుంది. ఒక్కసారి వాచ్‌వంక చూసుకుని ఉలిక్కిపడ్డాను.

'మై గాడ్! ఇటీజ్ ఫైవ్ టెన్, వాళ్ళకు చెప్పేసి మనం మళ్ళీ షాపింగ్‌కు వెళ్ళాలి. గుర్తుందా? బీ క్విక్!"

"అబ్బ! ఉండండీ మీరెప్పుడూ ఇంతే. టైమ్‌తోపాటు పరిగెత్తాలంటారు. ఒన్ మినిట్"

సుజీ చూపులు తిప్పకుండా అలంకరించుకుంటూనే వుంది.

అసహనంగా విండోగ్లాస్‌లోంచి మూడంతస్తుల కింది ప్రపంచాన్ని చూస్తూ నిల్చున్నాను. పట్టణాన్ని పొగమేఘాలు కప్పేస్తున్నాయి. దానిమీద సాయంసంధ్య పరుచుకుంటోంది ఎర్రగా. నిశ్శబ్దంగా—కాన్వాసు కంటని రంగులాగా. ఎప్పుడూ అదేరంగు అదే సాయంకాలం—మార్పులేదు. డెడ్ ఈవెనింగ్! ఆ ఎరుపు రంగుకంటే నా డియర్ లిప్‌స్టిక్ ఎరుపెంత బాగుంది తళతళ మెరుస్తూ! నా వీపు వెనక మెత్తని స్పర్శ. సుజీ నన్ను వాటేసుకుని ఎదురుగా తిప్పుకుంది, "ఎలా ఉన్నానన్నేను" అని ప్రశ్నిస్తున్నాయి ఆ కళ్ళు. కళ్ళకు తీర్చిదిద్దిన కాటుక. పెన్సిల్‌తో దిద్దిన కనుబొమ్మలు. ముఖాన అతికించిన బొట్టు. మెరిసే లిప్‌స్టిక్ కేక్‌తో పౌడరుతో మేకప్. హౌ బ్యూటిఫుల్! తమకం పట్టలేక కౌగిలించుకోబోయాను.

"స్టాప్ స్టాప్! మేకప్ చెరిగిపోతుంది సార్! ఇప్పటికే లేటయింది".

"మైగాడ్! ఇటీజ్ ఫైవ్‌థర్టీ! కమాన్ హరియప్" అంటూ గబగబా మెట్లు దిగి పోర్టికోలోకి వచ్చాను. నిన్ననే తీసిన కొత్త ప్రీమియర్ తెలుపు. పింక్ కలర్‌ల కాంబినేషన్‌తో అందంగా రెడీగా వుంది ఎన్నాళ్ళనుంచో కొత్తకారు కావాలని పోరుతోంది సుజీ. బిజినెస్ గొడవల్లో యిప్పటిదాకా నిర్లక్ష్యం చేశాను. ఇది ఆమె సెలక్షనే. పక్కనే పాతకారు వెలవెల బోతోంది. పూర్ క్రీచర్! దాన్ని కంపెనీకి తోలెయ్యాలి. డోర్‌తీసి డ్రైవింగ్ సీట్లో కూర్చోబోయాను.


"నో సర్! మొదట నేను డ్రైవింగ్ చెయ్యాల్సిందే" అంటూ సుజీ నన్ను పక్కకు నెట్టేసి డోర్ వేసేసింది. 'క్లిక్' హౌ స్మూత్ ఇట్ ఈజ్!

ప్రీమియర్ పాదరసంలా జారుతోంది రోడ్డుమీద. కుషన్ మెత్తటి కుదుపులిస్తోంది. బయటి మోతలు వినిపించకుండా విండోగ్లాస్ బిగించాను. రేడియో ట్యూన్ చేశాను. ఏదో వెస్టర్న్ మ్యూజిక్ మత్తుగా.... మెత్తగా వినిపిస్తోంది. రోడ్డువెంట మనుషులు రకరకాల భంగిమల్తో నిశ్శబ్దంగా మాట్లాడుకుంటూ నెనక్కి వెనక్కి వెళుతున్నారు—మూకీ సినిమా బొమ్మల్లా.

"ఫోన్ చేస్తే సరిపోయేది కాదూ? మనం హాయిగా షాపింగ్‌కి వెళ్ళేవాళ్ళం." అంది సుజీ రోడ్డుమీద నుంచి చూపుతిప్పకుండానే.

"నోనో. మనం స్వయంగా వాడింటికెళ్ళి చెబితేనే బాగుంటుంది" అన్నానేను.

వాడంటే రామ్మూర్తి. నా బంధువు. రచయిత. కథలూ గట్రా రాస్తుంటాడు. నేనంతగా చదవకపోయినా గొప్ప రచయిత అని నలుగురూ పొగడటం నాకు తెలుసు. మే మిద్దరం కలిపి చదువుకున్నాం. ఆ రోజుల్లో వాడు యెడతెగకుండా కబుర్లుచెప్పి నవ్వించేవాడు. ఉన్నట్టుండి గొంతెత్తి తారాస్థాయిలో ఏదో పాట అందుకునేవాడు. మా క్లాస్‌మేట్స్‌లో చాలామందికి వాడంటే యిష్టంగా వుండేది. చదువు ముగిసింతర్వాత నేను బిజినెస్‌లోకి దూకి చకచకా పైకొచ్చాను. వాడుమాత్రం చాలాకాలం నిరుద్యోగిగా గడిపాడు. చివరి కెలాగైతేనేం ఒక చిన్నపాటి ఉద్యోగం సంపాదించినా లైఫ్‌లో నాకంటే ఎన్నో మెట్లు దిగువనే వుండిపోయాడు.




కారు ఒక్క కుదుపుతో అశోక్‌నగర్‌లోని రామ్మూర్తి ఇంటి ముందాగింది. ఇద్దరం దిగాం. రామ్మూర్తి ఇంటి ముందు ఖాళీ స్థలంలో ఏదో పూలమొక్క నాటుతున్నాడు. కొడుకు రవి అతని మెడ చుట్టూ చేతులు వేసి వీపుమీద వేలాడుతున్నాడు. మమ్మల్ని చూడగానే చేతులు కడుక్కొని ఎదురు వచ్చాడు రామ్మూర్తి. రవి వచ్చి నన్ను వాటేసుకున్నాడు. లోపలనుంచి సునీతకూడా నవ్వుతూ వచ్చింది.

"ఏరా సీనూ! బాగున్నావా? ఏమ్మా! మమ్మల్ని మర్చిపోయినట్టున్నారే" అంటూ రామ్మూర్తి నాకు గట్టిగా షేక్‌హాండ్ ఇచ్చాడు. నాకు చెయ్యి నెప్పెట్టింది. వాడంతటితో ఆగకుండా నా భుజంచుట్టూ చెయ్యేసి లోపలికి లాక్కుపోయాడు. రామ్మూర్తిలో నాకు నచ్చని అంశాల్లో భుజంచుట్టూ చేతులు వెయ్యటం ఒకటి.

"మేకప్ కొంచెం ఎక్కువైనట్టుంది" అంటూ సునీత సుజీ బుగ్గపై చిటికేసింది సరదాగా.

సుజీ పుడుక్కుందని గ్రహించాను. మేకప్ విషయంలో అంత సెన్సిటివ్. కానీ పైకి నవ్వి వూరుకుంది. రామ్మూర్తీ నేనూ వరండాలో కూర్చున్నాం. రామ్మూర్తి కూతురు రాధకూడా నా దగ్గరికి వచ్చింది.

"అంకుల్ దగ్గరికి నేను ముందొచ్చాను తెలుసా?" అన్నాడు రవి.

"పెద్ద గొప్ప." అంది రాధ.

పిల్లలిద్దరూ స్మార్ట్‌గానే వున్నారు. బట్ ఆడుకొనివచ్చారేమో డర్టీగా ఉన్నారు. అంచేత దగ్గరికి తీసుకోలేకపోయాను. నా కొత్త సూట్, దానికంటుకున్న ఇంటిమేట్ పరిమళం అనవసరంగా ఖరాబు కావటం నాకిష్టంలేదు. రామ్మూర్తి మాత్రం రవిని దగ్గరికితీసుకుని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. సుజీ, సునీత లోపలికి వెళ్ళారు. పిల్లలు కూడా వాళ్ళవెంట పరిగెత్తారు.

మే మిద్దరం లోకాభిరామాయణంలో పడ్డాం. రామ్మూర్తి గలగలా మాట్లాడేస్తుంటే నేను కేవలం ఊ కొడుతున్నాను. మాటల్లో పొదుపు నా కెక్కువ ఇష్టంలేదు. లైఫ్‌లో ఒక్కొక్కమెట్టూ ఎక్కుతున్నకొద్దీ నా నోటికి ఒక్కో గడియవేస్తూ వచ్చాను. సొసైటీలో నా మాటకు విలువ హెచ్చేకొద్దీ దానికి మౌనాన్ని మప్పుతున్నాను. మాట నుంచి మనస్సును విడదీసి, మాట్లాడే సమయంలో దానికి వేరే పని కల్పిస్తున్నాను. రియల్లీ ఫెంటాస్టిక్. రామ్మూర్తి పిల్లల చదువుల గురించేదో చెబుతూ మధ్య మధ్య యథాలాపంగా బయటికి చూస్తున్నాడు. వరండాలోంచి నా

కొత్తకారు కనబడుతూనే వుంది. నేనిక భరించలేకపోయాను.

"కొత్త కారు కొన్నాను. చూశావా?" అన్నాను వున్నట్టుండి.

వాడు ముందు తెల్లబోయి తర్వాత నవ్వేశాడు. అప్పుడైనా యెంతయిందని అడుగుతాడేమో అనుకున్నాను. సుజీ దాన్నే విధంగా సెలెక్ట్ చేసిందో చెప్పటానికి సిద్ధపడ్డాను. కానీ వాడేం అడగలేదు. నేనే చెప్పాను.

"బాగుంది" అన్నాడు రామ్మూర్తి కారు వంక చూస్తూ చాలా సాధారణంగా.

"కారులో ఉన్న ఆనందం నీకు తెలీదు" అన్నానేనను వాణ్ణి సరదాగా దెబ్బకొట్టడానికి.

"కారులో ఆనందం లేదు. కారున్న వాడి మనస్సులో అను."

"పోనీ అలాగే అనుకో."

"నీ కార్లో నేను చాలాసార్లు కూర్చున్నాను. అయినా నా సైకిల్ తొక్కుకుంటూ ఈల వేసుకుంటూ ఆఫీసుకు వెళుతుంటేనే నాకానందం."

"ఆ కారు నీది కాదు గనక."

"కాదు. ఈ ఆనందం నా సృష్టిగనక."

"డామిట్."

రామ్మూర్తి పెద్దగా నవ్వాడు.వాడి నవ్వు ఉధృతంగా జలపాతంలాగా ఉంటుంది. నవ్వేప్పుడు వాడు సమస్తం మర్చిపోతాడు. ముఖం రక్త ప్రసరణతో ఎర్రగా మారుతుంది. అట్లా వాడెలా నవ్వగలుగుతాడో నాకర్థంకాదు.

లోపల్నుంచి సునీత టిఫిన్ తీసుకు వచ్చింది. సుజీకూడా వచ్చి మాతోపాటు కూర్చుంది. రాధ, రవి మంచినీళ్ళు తెచ్చి పెట్టారు. ప్లేట్లో పకోడీలు చూడగానే నాకు నోరూరింది. అయినా మొహమాటంకొద్దీ "ఇప్పుడెందుకోయ్ టిఫిన్?" అన్నాను.

రామ్మూర్తి మాత్రం వొక్కసారి గట్టిగా వాసన పీల్చి నాలుగైదు పకోడీలు నోట్లో వేసుకున్నాడు. నేను మెల్లమెల్లగా ఒక్కొక్కటి నోట్లో వేసుకుంటూ బాతాఖానీ ప్రారంభించాను.

"మళ్ళీ కథలేవైనా రాస్తున్నావా?"

"ఏవో రాస్తూనే వున్నాను."

"ఎందుకోగాని మీ కథలు నాకు బొత్తిగా నచ్చవండీ. అసలందులో మీరేం డీల్ చేస్తున్నారో నాకంతుపట్టదు" అంది సుజీ.

ఇంతకంటే ఒక రచయితమీద క్రూరమైన విమర్శ వుండదు.

"నిజానికి నాకంటే మా సుజీయే నీ కథలు బాగా చదువుతుంది" అన్నాను సమర్థింపుగా.

"నా కథల్లో నేను విశేషించి చెబుతున్నదేమీలేదు. మీ కంతుపట్టకపోవటానికదే కారణం. కాకపోతే మనిషి తనకుతానే దూరమవుతున్నాడనీ, కాకూడదనీ మాత్రమే నేను ప్రతిపాదించేది."


"ఆయనదంతా వెర్రి వేదాంతంలెండి." అంది సునీత నవ్వుతూ భర్తవంక చూస్తూ.

అయితే రామ్మూర్తంటే, వాడి కథలంటే ఆమెకెంత ప్రేమో నాకు తెలుసు. ఆ విషయాన్ని ఆమె చూపులే చెబుతాయి. చూస్తుండగానే రామ్మూర్తి ప్లేటు ఖాళీ చేశాడు. నేను సగం ప్లేటు అలానే వుంచేశాను. సునీత కాఫీలు తెచ్చింది. కాఫీలు తాగి మళ్ళీ కబుర్లలో పడ్డాం.

"ఇక బయల్దేరదామా? చీకటిపడింది" అంది సుజీ.

నేను వాచ్ చూసుకుని ఉలిక్కిపడ్డాను.

"మైగాడ్! చాలా టైమైంది. మళ్ళీ షాపింగ్‌కు వెళ్ళాలి. ఇక వెళ్ళొస్తా మోయ్!




రేపు మా చిట్టి బర్త్‌డే. మీరు తప్పకుండా రావాలి. ఎక్జాక్ట్లీ ఫైవ్. రాత్రికి మీల్స్ ఎరేంజ్‌మెంట్ అక్కడే. సినిమా ప్రోగ్రాంకూడా వుంది. ఓ. కె." అంటూ సెలవు తీసుకున్నాం.

ఈసారి స్టీరింగ్ నేను తీసుకున్నాను. సుజీ పక్కనే కూర్చుంది. మెయిన్ స్ట్రీట్‌లోకి రాగానే స్పీడ్ పెంచాను. ఫిఫ్టీ..సిక్స్టీ..సెవెంటీ....వీథులు, ఇళ్ళు, మనుషులూ, నియోన్‌లైట్లూ వెనక్కి వెనక్కి జరిగిపోతున్నాయి. వేగంలేకపోతే కారు కొయ్యగుర్రం.

నాకెందుకో ఆ సమయంలో రామ్మూర్తి రాసిన ఒక కథ గుర్తుకొచ్చింది. దాన్ని నేనెందుకు మర్చిపోలేకపోయానో నాకే తెలీదు. ఆ కథలోని హీరో—సురేష్—మహానగరంలో జన్మిస్తాడు. పుట్టడంతోనే వాడు పరిగెత్తడం ప్రారంభిస్తాడు. పరిగెత్తుతూనే చదువుకొంటాడు. పరిగెత్తుతూనే ఒక మ్మాయి మెళ్ళో తాళికడతాడు. ఆఫీసుకెప్పుడూ పరుగుపందెమే. పరిగెత్తుతూనే గుండె ఆగి .... .... మైగాడ్!.... సడెన్ బ్రేక్ వేశాను. కారుకింద పడబోయిన మనిషి తప్పించుకున్నాడు. వాడి ముఖంలో ఎంత తత్తరపాటు, భయం! నవ్వొచ్చింది. గేరు మార్చాను. మళ్ళీ అదే వేగం. పరుగు పందెం....

కారు బాంబే డ్రైయింగ్ ముందాగింది. ఇద్దరం లోపలి కడుగుపెట్టాం. కౌంటర్లో మేనేజర్‌లేచి "విష్"చేశాడు. చిరునవ్వుతో దాన్ని రిసీవ్ చేసుకున్నాను. చిట్టికి బర్త్‌డే గౌన్ సెలెక్ట్‌చెయ్యాలి. గంటసేపు సాగింది సెలక్షన్. షాపులోని గౌన్లన్నీ మా ముందే ఉన్నాయి. చివరికి నేనో బ్రౌన్ కలర్ గౌన్ సెలెక్ట్ చేశాను. సుజీకి మరో పింక్ కలర్‌ది నచ్చింది. నేనెంచిందే తీసుకుందామన్నాను. మొహం ముడుచుకుంది. రెండు గౌన్లూ పాక్ చేయించాను.

ఇల్లు చేరేటప్పటికి ఎనిమిది దాటింది. ఆయా చేతి వంట తిని చిట్టి నిద్రపోతోంది. ఇంకా కొంతమంది ముఖ్యమైనవాళ్ళని పార్టీకి రమ్మని ఫోన్ చేశాను. రిసీవర్ క్రెడిల్‌మీద ఉంచానో, లేదో ట్రింగ్.... ట్రింగ్....అంటూ మళ్ళీ మోత. విసుగ్గా ఫోనెత్తాను. మేనేజర్ కంపెనీనుంచి గోడౌన్‌లో స్టాక్‌కి హఠాత్తుగా మార్కెట్ పడిపోయిందట. హెవీ ఫాల్! దానిమీద నేనెన్ని ఆశలు పెట్టుకున్నాను? సెంట్ పర్సెంట్ లాస్! మైగాడ్! వాట్‌కెన్. ఐ డూ? మేనేజర్ యింకేమో చెబుతున్నాడు. నా చేతిలోంచి రిసీవర్ జారిపోయింది. నీరసంగా సోఫాలో కూలబడ్డాను. శరీరమంతా డొల్లగా శక్తి విహీనమైపోయింది. మనస్సు మొద్దుబారింది. గుండెల్లో మంట. సుజీ కళ్ళల్లో క్వెశ్చన్ మార్క్. ఏం చెప్పను? ఫ్రిజ్‌లోంచి "వైట్ హార్స్" తీశాను. గొంతులోకి మెత్తగాజారిపోయింది. మంటను మంట చల్లార్చింది. పరుగు.... పందెం.... లాస్ అండ్ గైన్.... లైఫ్ ఈజ్ యాన్ ఎకౌంట్‌బుక్!.... మత్తు.... మరుపు.

ఆ షాక్‌నుంచి తేరుకోవడానికి నాకు పన్నెండు గంటలు పట్టింది. మర్నాడు మధ్యాహ్నం నుంచి ఇంటి అలంకరణతోనే సరిపోయింది. ముందు హాలంతా అద్భుతంగా అలంకరించారు సుజీ, పనిమనుషులూ కలిసి. రంగురంగుల కాగితాలు, కాగితం బుట్టలు, తోరణాలు, హాలుముందు వెల్‌కమ్ బోర్డు— డెకరేషన్ నాకు చాలా నచ్చింది. హాలుమధ్యలో బర్త్‌డే కేక్ ఉంచిన టేబుల్ ఎరేంజ్ చేశాం.

సాయంకాలమవుతుండగా సుజీకి, నాకూ మధ్య ఘర్షణ జరిగింది— పార్టీలో చిట్టి వేసుకోవాల్సిన డ్రెస్ విషయంలో. నేను సెలెక్ట్‌చేసిన గౌనే తొడగాలనినేనూ, అలాగే తనూ పట్టుబట్టడంతో ఘర్షణ ప్రారంభమై మాటా మాటా పెరిగింది. ఒకళ్ళ నొకళ్ళు దెప్పుకున్నాం. తన మేకప్ గురించి నేను హేళనచేస్తే నా తాగుడు గురించి తను అవమానకరంగా మాట్లాడింది. అసలే కంపెనీలోలాస్ గూర్చి చికాగ్గాఉండటంతో కోపం పట్టలేక చెంపపెట్టు పెట్టాను. ఏడుస్తూ పడుకుంది. చిట్టి బిక్క మొహం వేసుకు చూస్తోంది. గెస్ట్స్ వచ్చే వేళయింది. సుజీ లేకపోతే పార్టీ రసాభాస అవుతుంది. గత్యంతరంలేక ప్రాధేయపడ్డాను. అరగంట బతిమిలాకించుకుని లేచింది.

ఆ సమయంలో యెప్పుడో వొకసారి రామ్మూర్తి నాతో అన్నమాటలు గుర్తుకొచ్చాయి. పెళ్ళి అయినప్పటినుంచీ వాడి పదేళ్ళ మారీడ్ లైఫ్‌లో తన భార్యతో యెప్పుడూ ఘర్షణపడలేదని చెప్పాడు. ఎప్పుడైనా సునీత కోపగిస్తే తను సర్దుకుపోతాననీ, అలాగే సునీతకూడా సర్దుకుపోతుందనీ అన్నాడు. ఆ మాట నాకిప్పటికీ అతిశయోక్తిగానే అనిపిస్తుంది. రెండు రోజుల కొకసారైనా సుజీతో నాకు ఘర్షణ తప్పదు. ఎంత చిన్న విషయంలోనైనా మాకు రాజీ తక్కువ. ఇండివిడ్యుయాలిటీ లేనివాళ్ళే మాటిమాటికీ సర్దుకుపోతూ బతికెయ్యగలరు.

మేం హాల్లోకి అడుగుపెట్టడంతోనే అతిథులొక్కొక్కళ్ళే రావడం మొదలైంది. ప్రతివాళ్ళ చేతుల్లోనూ విలువైన ప్రెజంటేషన్స్. చూస్తుండగానే ముందు ఆవరణంతా కార్లతోనూ, స్కూటర్లతోనూ నిండిపోయింది. హైకోర్టుజడ్జి ఒకాయన, ఎస్.పి. ఇద్దరు ముగ్గురు సేఠ్‌లు, ఇంకా ఎంతో మంది పారిశ్రామిక వేత్తలు— ఒకళ్ళేమిటి? పట్టణంలోని 'ఎలైట్' లోని చాలా భాగం ప్రస్తుతం నా ఇంట్లో ఆతిథ్యం స్వీకరిస్తోంది. వాటె ఫైన్ లుక్ ఇటీజ్! నా మనస్సులోని ఆందోళన తాత్కాలికంగా ఉపశమించింది.


సరిగ్గా అదే సమయంలో రామ్మూర్తి తనభార్యతో,పిల్లలతో ప్రత్యక్షమయ్యాడు. ఆ దృశ్యం నేనెప్పటికీ మరిచిపోలేను.చాలా సాధారణంగా నిన్న తన యింటి దగ్గరెలా వున్నాడో- అలానే వున్నాడు. గడ్డం కూడా గీసుకున్నట్టు లేదు. పక్కనే సునీత కూడా చాలా సింపుల్‌గా వుంది. మొహానికే మాత్రం మేకప్ లేదు. సుజీ పక్కన ఆమెను చూస్తే ఇద్దరూ వేరు వేరు లోకాలకు చెందినవాళ్ళలా కనిపించారు. రాధా, రవీ అప్పుడే చిట్టితో మాట్లాడేస్తున్నారు. ఒక్కసారిగా నా కెక్కడలేని చిరాకు కలిగింది. చిన్ననాటి స్నేహితుడని యింటికి వెళ్ళి మరీ ఆహ్వానిస్తే ఈ విధంగా హాజరవుతాడని నే ననుకోలేదు.నా అంతటి ఖరీదైన మనిషి పక్కన అంత "గ్లామర్‌లెస్ పర్సన్" నెలా భరించటం? పక్కవాళ్ళకి వాడినే విధంగా పరిచయం చెయ్యాలి?

ముందుగా రామ్మూర్తే నవ్వుతూ షేక్ హేండ్ ఇచ్చాడు. నా చెయ్యి మళ్ళీ నెప్పెట్టింది. సునీతని సుజీ రిసీవ్ చేసుకుంది.

"కొద్దిగా ఆలస్యమైంది" అన్నాడు రామ్మూర్తి.

"ఇట్సాల్‌రైట్. దానికేంగానీ ఏమిటీ అవతారం?" అడిగాను ఉండబట్టలేక.

"అవతారమేమిటి?" అన్నాడు వాడాశ్చర్యంగా.




"నీ అవతారమే ఈ మామూలు వేషం. ఆ మాసిన గడ్డం...."

"ఫర్వాలేదులే. ఇంటిదగ్గర ఇలానే ఉంటాను."

"ఇంటికీ, పార్టీకీ డిఫరెన్స్ లేదా?"

రామ్మూర్తి నవ్వి ఊరుకున్నాడు. వాడికింకేం చెప్పగలను? నా చిరాకు నసాళాని కంటింది.రామ్మూర్తి ఒక గులాబి పువ్వును చిట్టికి ప్రెజెంట్‌చేశాడు. చిట్టి దాన్నెంతో అపురూపంగా తల్లో పెట్టుకుంది. నా ఇతర అతిథులు తెచ్చిన ఖరీదైన బహుమతుల ముందు వాడు తెచ్చిన గులాబిపువ్వు నాకు నవ్వు తెప్పించింది.

"ఏరా నా కూతురుకి ఒక మామూలు గులాబి పువ్వును ప్రెజెంట్ చేస్తావా? హౌ డేర్ యువార్? దీనికి శిక్షేమిటో తెలుసా?" అన్నానేనను పరిహాసంగా.

"అనుభవించడానికి సిద్ధం. అయినా ఆ గులాబి పువ్వేం పాపం చేసింది?" అన్నాడు రామ్మూర్తి నవ్వుతూ

"స్టుపిడ్.... హలో, కమాన్.. కమాన్ ఉయార్ వెయిటింగ్ ఫర్ యూ" అంటూ మరో వ్యక్తిని ఆహ్వానించడానికి ఎదురు వెళ్ళాను.

మర్యాదగా ఆహ్వానించవలసిన వ్యక్తి, బిజినెస్ మాగ్నెట్, అవసరమైతే మా కంపెనీకి ఎంతైనా పెట్టుబడి పెట్టగలవాడు. నా బిజినెస్ దెబ్బతిన్న ఈ సమయంలో.... నవ్వుతూ సాదరంగా సోఫా చూపించి సంభాషణలోకి దిగాను.

హాలంతా కోలాహలంగా ఉంది. రంగు రంగుల దీపాలు. రంగు రంగుల మనుషులు మాటలు....నవ్వులు .... కేరింతలు. పని మనుషుల పరుగులు. గోల్డ్‌స్పాట్ బాటిల్స్ మూతలు లేస్తున్న చప్పుళ్ళు.నేనటూ యిటూ హడావుడిగా తిరుగుతున్నాను. ఒక్కచోట కాలు నిలవడం లేదు.ఎవరెవరొనో పలకరిస్తున్నాను. ఎవరెవరికో "ఆర్డర్స్" ఇస్తున్నాను. ఎందుకో నవ్వుతున్నాను. కంగారు పడుతున్నాను. తొందర, తొట్రుపాటు. స్పీడ్ అండ్ స్పీడ్! నాకేదో మైకంగా "విచిత్రంగా".బిజీగా ఉంది. బిజినెస్ ఈజ్ థ్రిల్! థ్రిల్ ఈజ్ లైఫ్!

మా అమ్మాయి కేక్ కట్ చేసింది చప్పట్ల మధ్య. "హేపీ బర్త్‌డే టూయూ...." పార్టీ గ్రాండ్‌గా ముగిసింది.అతిథు లొక్కొక్కరికీ వీడ్కోలు చెప్పాను. చివరికారు గేటు లోంచి వెళ్ళిపోయేసరికి హాల్లో మేమూ రామ్మూర్తి కుటుంబం మిగిలాం. హాలంతా చిందర వందరగా, బోసిగా ఉంది. సినిమా ప్రోగ్రాం ఉండటంవలన వెంటనే భోజనాలకి కూర్చున్నాం. భోంచేస్తుండగా సుజీ అంది!

"అబ్బ! తుపాను వెలిసినట్టుంది. ఈ పార్టీ కోసం ఎంత ప్రిపరేషన్! ఎంత డెకరేషన్! బర్త్‌డేకే ఇంత హడావుడైతే దీని పెళ్ళి కింకెంత హడావుడివడాలో!"

"ఇంత పెద్ద పార్టీ ఏర్పాటు చేస్తారనుకోలేదు" అంది సునీత.

"మన స్టేటస్‌కి తగినట్టుండాలిగదా ఏదైనా" అంది సుజీ క్యాజువల్‌గా.

"స్టేటస్ అంటే ఏమిటి డాడీ?" అడిగింది చిట్టి నన్ను.

"నాకు తెలుసు.స్టేటస్ అంటే అంతస్తు" అంది చటుక్కున రాధ.

"ఎన్నో అంతస్తు?" అమాయకంగా అడిగాడు రవి.

మా కందరికీ నవ్వొచ్చింది, రామ్మూర్తి పగలబడి నవ్వాడు. నవ్వినవ్వి పొలమారింది.

భోజనాలు ముగిసింతర్వాత కార్లో సినిమాకి బయల్దేరాం. స్టీరింగ్‌ముందు సుజీ

కూర్చుంది. పక్కన రవీ, రాధ కూర్చున్నారు. వెనక సీట్లో నేనూ, రామ్మూర్తీ, చిట్టీ, సునీత సర్దుకున్నాం. సుజీకి డ్రైవింగ్ అంతగా అలవాటు లేకపోవటంతో మెల్లగా పోతోంది కారు. చిట్టి సునీత నేదో అడుగుతుంటే ఆమె సమాధానం చెబుతోంది. రవీ, రాధా బయటి దృశ్యాలు చూస్తూ సంబరపడుతున్నారు. నేనూ రామ్మూర్తీ కబుర్లలో పడ్డాం.

"ఇంతకీ పార్టీ ఎలా ఉంది?" అడిగాను ఏదోచెబుతున్న రామ్మూర్తి మాటల్ని మధ్యలో కట్ చేసి.

"బాగానే ఉంది" అన్నాడు రామ్మూర్తి.

ఆ సమాధానంలో'నే' అనే అక్షరం నన్నెంతో బాధించింది. మనుషులు గబుక్కున వాస్తవాన్ని ప్రశంసించలేరు. రామ్మూర్తి రచయితైనా వాడిలోనూ యిటువంటి సంకుచిత స్వభావమా? నిజానికి చిట్టి బర్త్‌డే ఎంత గ్రాండ్‌గా చేశాను! ఎటువంటి ఫ్రెండ్స్ సర్కిల్ ఎటెండ్ అయింది! బర్త్‌డేకి హాజరైన వాళ్ళలో స్టేటస్ లేనివాళ్ళు ఒక్కళ్ళూ లేరు. అఫ్ కోర్స్ ఒక్క రామ్మూర్తి తప్ప. పార్టీ సమయంలో నా యింటి ముందు ఆగిన కార్లెన్నో చూశాను. ఇరవై దాకా వున్నాయి. ఆ దృశ్యమే చెబుతుంది పార్టీ ఎంత గ్రాండ్‌గా జరిగిందో.

సినిమాహాలుచేరాం. రామ్మూర్తి టిక్కెట్లు తీసుకోబోయాడు. నేనిచ్చే పార్టీకి వచ్చి వాడు తీసుకోవడమేమిటి? వాణ్ణి వారించి నేనే టిక్కెట్లు తీసుకున్నాను. డైమండ్ సర్కిల్‌లోకి వెళ్ళి కూర్చున్నాం. ఏదో పాత ఇంగ్లీషు సినిమా. జంతు ప్రపంచాన్నంతటినీ ప్రదర్శిస్తోంది. మనిషి వాటినెలా వేటాడేదీ అవి మనుషులకెలా మచ్చిక అయ్యేదీ చూపిస్తోంది. రామ్మూర్తి నా పక్కనే రవిని ఒళ్ళో కూర్చోబెట్టుకుని పూర్తిగా సినిమాలో లీనమైపోయాడు. నేను మాటి మాటికీ తలతిప్పి రామ్మూర్తివంకా, ప్రేక్షకులవంకా చూడసాగాను. సినిమా చూస్తూ ఏకాగ్రతతో సర్వం మర్చిపోయి అనుభూతికి గురికావడం ప్యూర్ మాడ్‌నెస్! అంత సిల్లీ కాన్‌సెంట్రేషన్ నాకు గిట్టదు.

ఇంటర్వెల్‌లో గోల్డ్‌స్పాట్ తెప్పించాను నేను. మా చిట్టికి ఫావరెట్ డ్రింక్ ఇది. పిక్చర్ మళ్ళీ మొదలు కాగానే రామ్మూర్తి యథాప్రకారం అందులో లీనమైపోయాడు. నాకు బోర్‌గా ఉంది. సుజీకీ అలానే ఉన్నట్టుంది. ఇద్దరం కబుర్లలో పడ్డాం— మధ్య మధ్య సినిమా వంక చూస్తూ. తెరమీద ఏనుగుల గుంపులు తిరుగుతున్నాయి. ఒక చిన్న ఏనుగుపిల్ల కాలుజారి నీళ్ళలో పడింది. రామ్మూర్తీ, రవీ బిగ్గరగా నవ్వారు. చిన్నపిల్లల ఆనందం వాడలాగా బిగ్గరగా నవ్వడం— ఐ హేటిట్. అలా నవ్వితే ఊపిరాడదు నాకు. పొట్ట చెక్కలయ్యే జోకు విన్నా ఉబికివచ్చే నవ్వుని అణిచి దాన్ని మందహాసంగా మార్చి నా పెదాలమీద నాట్యం చేయిస్తాను కాసేపు. దటీజ్ బ్యూటీ!

పిక్చర్ ముగిసేసరికి సన్నగా వర్షం మొదలైంది. గబగబా కార్లో కూర్చుని అద్దాలు బిగించేసి బయల్దేరాం. స్టీరింగ్ ముందు యథాప్రకారం సుజీ. రామ్మూర్తి కుటుంబాన్ని వాడి యింటిదగ్గర డ్రాప్ చెయ్యాలి. ముందుసీట్లో రవీ, రాధ సింహం గొప్పదా, ఏనుగు గొప్పదా అని వాదించుకుంటున్నారు. నా పక్కన చిట్టి కునికిపాట్లు పడుతోంది. వర్షంలో తడిసి మెరుస్తున్న రోడ్డు. రోడ్డుమీద పాదరసంలా కారు. కారుముందు అద్దంమీద ముత్యాల్లా చినుకులు. ముత్యాల్ని చెదరగొడుతూ కదుల్తున్న వైపర్. ఉన్నట్టుండి రామ్మూర్తి హుషారుగా ఈలవేస్తూ ఏదో పాటను "హమ్" చెయ్యడం ప్రారంభించాడు.

"రామ్మూర్తిగారేమిటి ఇంత హుషారుగా ఉన్నారు?" అడిగింది సుజీ వేళాకోళంగా.

"వాతావరణం ఆహ్లాదంగాఉంది"అంటూ రామ్మూర్తి విండోగ్లాసు కిందికి దించాడు. ఒక్కసారిగా జల్లు మొహాన పడింది.

"ఆహా ప్రాణానికి హాయిగా ఉంది. ఈ వర్షంలో రోడ్డుమీద తడుస్తూ వెళితే ఎంత బాగుంటుంది!" అంటూ మళ్ళీ ఈల వెయ్యసాగాడు.

"మా వాసు ఈలపాట స్పెషలిస్ట్. అప్పుడప్పుడూ ఆఫీసులోనూ ఈలవేస్తూ వాళ్ళ బాస్‌చేత చివాట్లు తింటుంటారు" అంది సునీత నవ్వుతూ.

"సర్లేవోయ్ సినిమా బాగుందిగదూ?" అడిగాడు రామ్మూర్తి.

"బోర్. స్టోరీ లేదు, పాటా లేదు. ఆ జంతువుల్ని చూపించి చూపించి చంపాడు" అన్నాను నేను.

"నాకు మాత్రం బాగుంది. ముఖ్యంగా ఆ ఏనుగు పిల్ల కాలుజారి పడినప్పుడు నవ్వలేక చచ్చాననుకో" అన్నాడు రామ్మూర్తి.


వెలువడినాయి!

రంగనాయకమ్మ కొత్త పుస్తకాలు

జానకి విముక్తి-3 (ఆఖరి భాగం)

ఇది 2 సంపుటాలలో
• మొదటిసంపుటం ..........15రూ.
• రెండో సంపుటం ..........15రూ.

ఒక అర్ధరాత్రిపూట 'భర్త' ఇల్లు విడిచి చీకట్లోకి పరుగెత్తిన జానకి ఏమైంది? ఎక్కడికి వెళ్ళింది? ఆమె జీవిత మార్గం ఎటు మళ్ళింది? — ఈ కథంతా ఈ ఆఖరి భాగంలో చదవండి.

మీరు చదివారా? ..........
• జానకి విముక్తి-1 ...5రూ. | • జానకి విముక్తి-2 ...16రూ.

ఇంకో కొత్త పుస్తకం ⟶ చలం సాహిత్యం రూ.7.50

• పుస్తకం ధర M.O. పంపితే, పుస్తకం V.P.P ద్వారా పంపుతాము.

ప్రతులకు—

అరుణా పబ్లిషింగ్ హౌస్. ఏలూరు రోడ్, విజయవాడ-2

"నాన్నా! మనంకూడా ఒక ఏనుగు పిల్లను పెంచుకుందామా?" అడిగాడు రవి సీటుమీదుగా తల వెనక్కి పెట్టి వుత్సాహంగా.

"అలాగే. మనం తిండి మానేసి దాన్ని పోషిద్దాం" రామ్మూర్తి అన్నాడు సీరియస్‌గా.

సుజీ, సునీతా నవ్వారు. సుజీ కారు స్పీడు పెంచింది.

"ఏనుగుల గ్రూప్ లివింగ్, వాటి యూనిటీ నాకెంతో నచ్చాయి. కర్మగాలి మనుషుల్లోనే ఆ లక్షణం కనబట్టంలేదు" అన్నాడు రామ్మూర్తి.

"మనమూ ఒక సొసైటీగా మూవ్ కావటంలేదా?"

కారు వేగంగా త్రాచుపాములా వెళుతోంది.

"కావచ్చు. కానీ ప్రతిమనిషీ రెండో వాడికి ఒక జీవితమంత దూరం."

"అంటే?"

ఎదురుగా ఏదో ఖాళీ రిక్షా వస్తోంది.

"అంటే నువ్వెప్పుడన్నా దివాలాతీస్తే నీ కూతురి బర్త్‌డేకి వచ్చి దీవించిన వాళ్ళెవ్వరూ సాయపడరని తాత్పర్యం."

"నేనెప్పటికీ దివాలాతియ్యను" అన్నాను నేను రోషంగా.

రిక్షా దగ్గరికి వచ్చేసింది.

"కాబట్టే నీ కూతురి బర్త్‌డేకి వాళ్ళు నీ యింటికి వస్తారు."

ఈ మాట నా 'ఇగో'మీద దెబ్బతీసింది. నేనేదో విసురుగా సమాధానం చెప్పబోయాను. ఇంతలో....ధన్! మైగాడ్!! యాక్సిడెంట్! కారు స్లిప్ అయి రిక్షాని గుద్దేసింది. రిక్షా తలకిందులైంది. రిక్షావాడు ఎగిరి దూరంగా పడ్డాడు. మోకాళ్ళకీ, చేతులికీ గాయాలు. రక్తం! వర్షంలో తడుస్తున్న రక్తం! నా కాళ్ళూ, చేతులూ ఆడటంలేదు. సుజీ బిత్తరపోయి దిగేసింది. రామ్మూర్తి కారులోంచి ఒక్క దూకు దూకి రిక్షావాణ్ణి లేవదీశాడు. రుమాలుతో వాడి కాలుకి కట్టు కట్టాడు. నేను దగ్గరికెళ్ళి ఏం చెయ్యటానికీ పాలుపోక చూస్తూ నిలబడిపోయాను. నా సూట్ తడిసిపోతోంది. రవీ, రాధా, చిట్టీ, సుజీ బిత్తరపోయి చూస్తున్నారు. సునీత ఉబికివచ్చే కన్నీళ్ళు తుడుచుకుంటోంది.

"ఇప్పుడెలా?" అంది సుజీ దీనంగా.

"డామిట్. అంత రాష్‌గానా నడిపేది? ఒళ్ళు దగ్గరుండాలి." నేను కసురుకున్నాను.

"కేసవుతుందేమో?"

"అది నేను చూసుకుంటాన్లే" అన్నాను నేను దూకుడుగా.

రామ్మూర్తి ఒక్కసారి తలతిప్పి మా యిద్దరివంకా చూశాడు. నా గొంతుకేదో అడ్డు పడ్డట్టయింది. ఇంతలో ఆ దారినే మరో రిక్షా పోతుంటే ఆపి రామ్మూర్తి దెబ్బల్తో మూలుగుతున్నవాణ్ణి ఆ రిక్షాలో యెక్కించాడు.

"నేనితన్ని హాస్పిటల్లో చేర్పించివస్తాను మీరు వెళ్ళండి" అన్నాడు రామ్మూర్తి తనూ రిక్షా యెక్కుతూ.

"నేనూ వస్తాను" అన్నాను నేను మామూలుగా.

నిజానికి నాకు వెళ్ళాలని లేదు. ఏదో చిన్న యాక్సిడెంట్ జరిగినంత మాత్రాన ఆ వర్షంలో అర్ధరాత్రి వాణ్ణి మోసుకెళ్ళాలా లేనిపోని బెడద. వాడి మొహాన నాలుగు నోట్లు విసిరేస్తే సరిపోదా?

"అవసరంలేదు. మీరు వెళ్ళండి. నేను తొందరగా వస్తాన్లే" అంటూ రిక్షాను పొమ్మన్నాడు.

నేను జేబులో నుంచి డబ్బు తీసి ఇవ్వబోయాను. రామ్మూర్తి తీసుకోలేదు. రిక్షా అల్లంత దూరం వెళ్ళేదాకా చూసి మేం కారెక్కాం. ఈసారి కారు నేనే నడవసాగాను. సుజీ సునీత పక్కన కూర్చుంది వెనకసీట్లో. కారు మా యింటికే పోనిచ్చాను నిదానంగా. దార్లో ఎవ్వరం మాట్లాడుకోలేదు. పోర్టికోలో కారాపిన తర్వాత హెడ్ లైట్ల వెలుతుర్లో కారేమన్నా దెబ్బతిందేమో పరీక్షించాను. రిక్షాకి గుద్దుకుని బంపర్ కుడివైపు కొంచెం వంకరపోయింది. నా మనస్సు చివుక్కుమంది. కొత్తగా కొన్న వస్తువు!

ఆ రాత్రి సునీతా వాళ్ళు మా యింట్లోనే ఉండిపోయారు. నేను తడిసిన సూట్ మార్చి బెడ్ మీద వాలిపోయాను. చిట్టి బర్త్‌డే అలా ముగిసినందుకు మనస్సు వికలమై ఎంతకీ నిద్రరాలేదు. స్లీపింగ్ టాబ్లెట్స్ మింగాను. కళ్ళముందు మెల్లగా తెరలు కమ్మసాగాయి. ఆ తెరల్లో యెందుకో నా కళ్ళ ముందు


ఆరునెలలుగా ప్రభుత్వ నిషేధంవల్ల మరుగునపడి రాష్ట్ర హైకోర్టు తీర్పువల్ల మళ్ళీ వెలుగులోకి వచ్చిన

* మరీచిక *

పునర్ముద్రణ త్వరలో వెలువడుతోంది!

ఇందులో....

* నవల నిషేధ ఉత్తర్వు–హైకోర్టు తీర్పు
* వివిధ పత్రికలలో వచ్చిన సంచలన వ్యాసాలు
* మిర్యాలగూడెం విద్యార్థి ఆత్మహత్య అసలు కథ
* రచయిత్రి ముందు మాట

ప్రత్యేక ఆకర్షణలు!

మరీచిక నవలా రచయిత్రి

వాసిరెడ్డి సీతాదేవి

లేఖిని నుంచి వెలువడిన డైరెక్టు నవల

మరో మనసు కథ... రూ. 12/-

ఆగష్టు '82 లో వెలువడింది!

ఆంధ్రపత్రిక సీరియల్

మనసు కథ

త్వరలో మరీచికతో పాటు విడుదలౌతుంది!

ఈ క్రింది చిరునామాకి రాసి నేడే మీకు కావలసిన కాపీలు రిజర్వు చేసుకోండి!

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ * 3237, రాష్ట్రపతిరోడ్ * సికింద్రాబాద్-500 003

గాయాలు తగిలిన రిక్షావాడుగాక రామ్మూర్తి రూపమే కదలాడ సాగింది.

తెలతెల వారుతుండగా రామ్మూర్తి వచ్చాడు. రాత్రంతా నిద్రపోకుండా యెదురుచూసిన సునీత యెంతో ఆత్రంగా వాడికి యెదురు వెళ్ళింది. జేవురించిన మొహంతో, ఎర్రబడ్డ కళ్ళతో ఏదోగా వున్న రామ్మూర్తిని నేనేమీ అడగలేక పోయాను. వాడూ ఏం చెప్పలేదు. తర్వాత తెలిసింది— వాడు ఆ రాత్రి చాలా అవస్థ పడ్డాడనీ ఆ రిక్షావాడికి ట్రీట్‌మెంట్ యిప్పించి ఇంటికి చేర్చాడనీ. సో సిల్లీ! రియల్లీ వాడో వింత మనిషి. నాకు చస్తే అర్థం కాదు. ●


# మీ చిగుళ్లను దృఢంగా వుంచుకోండి మీ పళ్లకు దీర్ఘ ఆయుస్సునివ్వండి.




## కేవలం ఫోర్‌హెన్స్‌లో మాత్రమే చిగుళ్లను దృఢపర్చగల ఒక ప్రత్యేకమైన అస్ట్రింజంట్ కలదు.

**దీని అద్వితీయమైన రుచియే దీని ప్రభావానికి ఋజువు**

ఫోర్‌హెన్స్‌లోని అస్ట్రింజంట్ చిగుళ్లకు విశిష్టమైన రక్షణ నిస్తుంది. ఈ అస్ట్రింజంట్ వాపును అరికట్టి బలహీనమైన మరియు మెత్తబడిన చిగుళ్లను సంకోచింపజేసి వాటిని ఆరోగ్యంగా వుంచుతుంది. మీ పళ్లకు దీర్ఘ ఆయుస్సు మరియు దృఢమైన ఆధారాన్ని ఆరోగ్యమైన చిగుళ్లే ఇవ్వగలవు. ఆరోగ్యమైన పళ్లకు కూడా కావాలి దృఢమైన చిగుళ్ల ఆధారం. అందుకే మీకు కావాలి ఫోర్‌హెన్స్...అస్ట్రింజంట్ కల్గిన అద్వితీయమైన టూత్ పేస్టు.




## ఫోర్‌హెన్స్‌ను విశ్వసించండి.

**ఇది పళ్ల డాక్టరు సృష్టించిన టూత్‌పేస్టు**

288 F 203 TEL